క్లుప్తంగా

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో స్థానం

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం అనుబంధ గురుకుల ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా సంక్రాంతి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ధరావత్ వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి డి.రవి నియామకమయ్యారు. ఈనెల 25న హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావా రవిల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కిన్నెరసాని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీలో నియామకమైన వారిని అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. గురుకులాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వెంకటరెడ్డి, రవి, కిశోర్ కుమార్, కవిత, వనిత, రమ్య, అనిల్, నాగేంద్ర పాల్గొన్నారు.

సరస్వతీమాత విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రోడ్డులోని ఆశ్రమ గిరిజన పాఠశాలలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల వ్యయంతో సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ దోసపాటి వెంకటేశ్వరరావు, దారా నరసింహారావు, చలవాది ప్రకాశ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దోసపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... పాఠశాల హెచ్‌ఎం బుచ్చిరాములు, ఉపాధ్యాయులు, బాలు, కళావతి, వసంత తమను గతంలో సరస్వతీమాత విగ్రహం ఏర్పాటు చేయాలని కోరడంతో తిరువూరు నుంచి శిల్పి కోటేశ్వరరావును ఇక్కడికే రప్పించి తయారు చేసి ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువులో ప్రతిభ కనబర్చి, ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెండ్యాల రోజాలక్ష్మి, ఇందిర, గుబ్బ దుర్గ, శ్రీలక్ష్మి, దారా పద్మ, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయండి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా, మండల కార్యాలయాలలో పని చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు, సీఆర్‌పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్, కేజీబీవీ ఉద్యోగ కోఆర్డినేటర్లు నవంబర్ వేతనాలు విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, బి.రవి డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, డిసెంబర్ పూర్తయినా వేతనాలు అందకపోవడంతో క్రిస్మస్ పండుగకు పస్తులు ఉండాల్సి వచ్చిందని వాపోయారు.

వంటగ్యాస్ ఈ కేవైసీ ఇంటికే వచ్చి చేస్తాం..

పాల్వంచ: సబ్సిడీ వంటగ్యాస్ కనెక్షన్ కోసం ప్రభుత్వం ఈకేవైసీని తప్పని సరి చేసిందని, వినియోగదారుల వద్దకే తమ సిబ్బంది నేరుగా వచ్చి ఈకేవైసీ చేస్తారని, ఎవరూ ఆందోళన చెందవద్దని హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలో ఈకేవైసీ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. వినియోగదారులు సహకరిస్తే నిర్ణీత సమయంలోనే పూర్తి చేస్తామన్నారు. కొందరు వినియోగదారులు కార్యాలయానికే వచ్చి బారులు తీరి సమయం వృథా చేసుకుంటున్నారని తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రంలో గురువారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఐఈఆర్‌పీలు శ్రీరామ్, అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో పాటు, బడిబయట పిల్లలకు సాధారణ విద్యార్థులకు కూడా పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రన్నింగ్, వీల్‌చైర్, ట్రైసైకిల్ పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన వివిధ అంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూకా రాజా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉంటే ఒక్క ఆధార్ కేంద్రం కూడా లేకపోవడంతో కొత్త కార్డులు, అప్‌డేట్ కోసం కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాలకు వ్యయ ప్రయాసలకు ఓర్చి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి టేకులపల్లిలో ఆధార్ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు.



ఇల్లెందు: తొలిసారి ఓటేసిన ఓటర్లు



టేకులపల్లి: కేఓసీలో ఓటు వేసిన కార్మికులు, సింగరేణి(కొత్తగూడెం): జీకేఓసీలో.... ఉద్యోగులు

సింగరేణి ఎన్నికలు ప్రశాంతం

- కొత్తగూడెం ఏరియాలో 94.09, కార్పొరేట్‌లో 96.47, ఇల్లెందులో 98.20, టేకులపల్లిలో 97 శాతం
- పోటాపోటీగా ఓటర్లను ప్రసన్నం చేసుకున్న కార్మిక సంఘాలు..



టేకులపల్లి: ఎన్నికల అనంతరం కేఓసీ నుంచి బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బుధవారం జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొత్తగూడెం రీజియన్‌లో 95శాతం ఓట్లు పోలయ్యాయని సింగరేణి అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. రీజియన్‌లోని కొత్తగూడెంలో 2,331 ఓట్లకు 2,207 ఓట్లు, 94.09 శాతం పోలింగ్ నమోదు అయింది. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో 1,191 ఓట్లకు 1149 96.47శాతం పోలయ్యాయి. ఇల్లెందు ఏరియాలో 614 ఓట్లకు 600 ఓట్లతో 98.20శాతం నమోదు అయింది. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 95శాతం పోలింగ్ కావటంతో కేంద్ర, కార్మికశాఖాధికారులు, సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యవేక్షించిన డీఎస్పీ, ఏరియా జీఎం...

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు పర్యవేక్షించారు. ఏరియాలోని జీకేఓసీ, ఏరియా వర్క్‌షాపు, ఏజెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లను వారు పర్యటించారు.

ఇల్లెందు: ఇల్లెందులో సింగరేణి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగాయి. ఉదయం 7 గంటలకే కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభమైన వెంటనే కార్మికులు మొదటి షిఫ్ట్ డ్యూటీకి వెళ్లేందుకు ఓటు హక్కును వినియోగించున్నారు. ఇల్లెందు ఏరియాలో 614 ఓట్లకు గాను 604 పోలయ్యాయి.

అధికారులు, నేతలు పోలింగ్ కేంద్రాల సందర్శన

ఎన్నికల ఓటింగ్ సరళిని ఆయా పార్టీల అగ్రశ్రేణి నాయకులు సందర్శించి పరిశీలించారు. ఇల్లెందు జేకే ఓసీని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ త్యాగరాజు, ఉపాధ్యక్షుడు లింగాల జగన్నాథ, మహబూబ్, ఇమామ్, జే.వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు, కళ్లం కోటిరెడ్డి, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రహ్మం, నజీర్ అహ్మద్, శంకర్, కాంగ్రెస్ నేతలు జాని, డానియేల్, పులి సైదులు, సీపీఎం మండల కార్యదర్శులు నబీ, కిరణ్, తహసీల్దార్ కె.రవి కుమార్, ఎన్నికల అధికారి సంతోష్ మహూర్, డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి, సింగరేణి జీఎం జాన్ ఆనంద్ సందర్శించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో తమ తమ డెన్‌లను ఏర్పాటు చేసుకుని కార్మిక సంఘాలు, వాటి కూటములు ఓటర్లను తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. ఎన్నికల ప్రశాంతంగా జరగడంతో పోలీసులు, సింగరేణి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

టేకులపల్లి: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం కోయగూడెం ఓపెన్ కాస్టులో ప్రశాంతంగా ముగిశాయి. కేఓసీలో 122 ఓట్లకు గాను 118 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 97 శాతం నమోదైంది. ఒకే ఒక్క మహిళా కార్మికురాలు ఇర్ప శారద తమ ఓటు హక్కు వినియోగించుకుంది. పీఓగా లింగానాయక్‌తో పాటు ముగ్గురు ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఏఆర్‌ఓ సంతోష్, ఎస్వోటూ జీఎం మల్లారపు మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ పసునూరి కృష్ణ, కె.సత్యనారాయణ రాజు పర్యవేక్షించారు. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి, ఎస్అండ్‌పీసీ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ అనంతరం బోడు ఎస్‌ఐ రంజిత్ ఆధ్వర్యంలో బందోబస్తుతో బ్యాలెట్ బాక్సును ఇల్లెందుకు తరలించారు.



ఇల్లెందు: జీఎం కార్యాలయం వద్ద కోలాహలం



ఇల్లెందు: ఓటేసిన సింగరేణి ఉద్యోగులు



టేకులపల్లి: కేఓసీ వద్ద పోలింగ్ కేంద్రం బందోబస్తు



ఇల్లెందు: ఏఐటీయూసీ నేతల ప్రచారం



ఓటరు గుర్తింపు కార్డు తనిఖీ చేస్తున్న పోలీసులు

దళారులకు చెక్ పెట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, పక్కన మున్సిపల్ చైర్మన్ డీవీ తదితరులు

ఇల్లెందు: తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలులో దళారులకు చెక్ పెట్టండి.. ఎవరికీ అన్యాయం జరగకూడదు.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మారండి.. సంక్షేమ పథకాల అమలులో అపోహలు ఉండొద్దు.. పదేళ్లుగా పుట్టెడు కష్టాల్లో ఉన్న ప్రజలు ఏ దరఖాస్తు ఇచ్చినా స్వీకరించండి అని నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి జే.కాశయ్య అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గురువారం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా జరగనున్న ప్రజాపాలన ఆరు గ్యారంటీల గ్రామసభలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలు అనేక సమస్యలతో ఉన్నారని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేలా అవకాశం కల్పించాలని కోరారు. ప్రతీ అధికారి బాధ్యతతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరాలని సూచించారు. గ్రామసభలలో దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ పథకాల అమలుకు కొంతమంది దళారులు మధ్యవర్తులుగా మారుతారని అలాంటి వారికి చెక్ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీలను భాగస్వాములను చేయాలని మున్సిపాలిటీలో కౌన్సిలర్లను ఆహ్వానించాలని తెలిపారు. గ్రామసభ వద్ద అంగన్‌వాడీ, ఆశా, ఆర్పీ నిరక్షరాస్యులకు సహకరించాలన్నారు. ప్రజాపాలనపై మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం అనే భావన కలిగించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి, టేకులపల్లి మండల ప్రత్యేక అధికారి వేల్పుల విజేత, కమిషనర్ నవీన్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ బాలరాజు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



దరఖాస్తులతో ఎమ్మెల్యే, తదితరులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తులను బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని దరఖాస్తుల పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు, మున్సిపల్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ శారదకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

జూలూరుపాడు: ప్రస్తుత స్థానిక ఉప మార్కెట్ యార్డును శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డు నడుస్తుండటంతో కనీస సౌకర్యాలు లేక రైతులు, హమాలీలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెస్ రూపంలో రూ.కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు, హమాలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఏన్కూరు మార్కెట్ కమిటీతో ఎలాంటి సంబంధం లేకుండా శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌లు దృష్టి సారించి శాశ్వత మార్కెట్ ఏర్పాటు కోసం కృషి చేయాలని విన్నవించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శారదకు అందజేశారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాజశేఖర్, లింగాల వీరభద్రం, ఎస్.నరసింహారావు, జవహర్‌లాల్, ఇరప రాజు, హమాలీ మేస్త్రీలు కల్లోజి రామస్వామి, ప్రతాప్, ఇల్లంగి సుందర్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టిజన్లను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న కాల్వ భాస్కర్‌రావు

పాల్వంచ: రాజ్యాంగం నుంచి సోషల్, సెక్యులర్ పదాల తొలగింపు ప్రయత్నాలను విరమించుకోవాలని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం సెక్రెటరీ జనరల్ రాసూరి చంద్రశేఖర్, స్టేట్ సెక్రెటరీ కాల్వ భాస్కర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీపీఎస్ పాత ప్లాంట్ స్థానంలో కొత్త ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆర్టిజన్లను పర్మనెంట్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని, అసంఘటిత కార్మికవర్గాలకు రూ.5లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, ప్రభుత్వ రుణాలు అందించాలని, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, ప్రతి మండల, జిల్లా స్థాయిలో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కాల్వ ప్రకాశ్‌రావు, రామస్వామి, కాశిమల్ల ఆనందరావు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ను విజయవంతం చేయండి

నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ సభలు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి రమేష్ తెలిపారు. ఈ గ్రామసభలలో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మొదటి రోజు గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్ కాలనీ, ప్రశాంతినగర్, అశోక్‌నగర్ కాలనీ, సంజయ్‌నగర్, లోతువాగు పంచాయతీలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు.

సుజాతనగర్: ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఖాజామొహీనుద్దీన్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో ప్రజాపాలనపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇందుకోసం మొత్తం 97 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేటి నుంచి జనవరి 6 వరకు (ప్రభుత్వ సెలవులు మినహా) దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జినుగు మరియన్న

ఇంటింటికీ దరఖాస్తులు అందజేత..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులకు నగదు చెల్లించాల్సిన అవసరం లేదని, గ్రామ పంచాయతీలో జరిగే గ్రామసభకు ఒకరోజు ముందే అధికారులు ఇంటింటికీ తిరిగి ఇస్తారని తహసీల్దార్ జి.శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జూలూరుపాడు: మండలంలో ప్రజాపాలన గ్రామ సభలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావులు తెలిపారు. బుధవారం అధికారులు మాట్లాడుతూ.. దరఖాస్తులు ప్రజలకు ఉచితంగానే ఇవ్వబడతాయని, వాటికి ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు జత చేయాలని సూచించారు.

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరు గ్యారెంటీ హామీల అమలు గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి జినుగు మరియన్న ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, సీఐ కరుణాకర్, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏపీఎం దుర్గారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రజాపాలన గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ కృష్ణవేణి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమణారెడ్డి, ఎంపీఓ గాంధీ, విద్యుత్ ఏఈలు దేవా, బుజ్జి కన్నయ్య, ఏవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాలకు సంబంధించి కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో ఎనిమిది రోజుల పాటు దరఖాస్తుల పంపిణీ, స్వీకరణ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామసభలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రమణమూర్తి

టేకులపల్లి: గురువారం నుంచి ప్రారంభం కానున్న ప్రజా పాలన గ్రామసభలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరగాలని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి అన్నారు. బుధవారం టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ప్రజాప్రతినిధులు సహకరించాలని, గ్రామసభల్లో ఎవరైనా వాగ్వాదాలు, అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులతో మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని, ఇబ్బందులు పెట్టేవారు, నేరస్తులు, అవాంతరాలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి, రంజిత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి అవిశ్వాస గండం



ఆర్డీఓ శిరీషకు అవిశ్వాస లేఖ అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కు అవిశ్వాస గండం పొంచి ఉంది. మెజారిటీ కాంగ్రెస్ ఎంపీటీసీలు బుధవారం కొత్తగూడెం ఆర్డీఓ శిరీష, ఇల్లెందు ఎంపీడీఓ బాలరాజుకు అవిశ్వాస పత్రం అందజేశారు. ఇల్లెందు మండల పరిషత్‌లో మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 12 ఎంపీటీసీ స్థానాలను, న్యూడెమోక్రసీ 3 ఎంపీటీసీలను, రొంపేడులో ధనసరి శాంతమ్మ ఇండిపెండెంట్‌గా గెలిచారు. అత్యధిక ఎంపీటీసీలను గెలుచుకున్న బీఆర్‌ఎస్ నుంచి ఎంపీపీగా చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీగా దాస్యం ప్రమోద్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరి పదవీ కాలం 2024 జూన్ 7వ తేదీ వరకు ఉంది. ఇదిలా ఉండగా మండల పరిషత్‌లో బీఆర్‌ఎస్ 12 స్థానాలు గెలుచుకోగా అందులో ఒకరు అనర్హతకు గురయ్యారు. మిగతా 11 మందిలో ఏడుగురు సభ్యులు కాంగ్రెస్ గూటికి చేరారు. న్యూడెమోక్రసీ నుంచి మాణిక్యారం ఎంపీటీసీ, ఇండిపెండెంట్‌గా గెలిచిన ధనసరి శాంతమ్మ ఇరువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో మండల పరిషత్తులో కాంగ్రెస్ సంఖ్యాబలం 9కి చేరింది.

వైస్ ఎంపీపీపై అవిశ్వాసం పెట్టేందుకు అవసరమైన సంఖ్యాబలం ఉండటంతో కాంగ్రెస్ ఎంపీటీసీలు ఎంపీడీవో, ఆర్డీవోలను కలిసి లేఖ అందజేసినట్లుగా తెలుస్తోంది. మండల పరిషత్తులో బీఆర్‌ఎస్ బలం ప్రస్తుతం నాలుగుకు పడిపోగా మిగిలిన ఇద్దరిలో ఒకరు ప్రజాపంథా, మరొకరు న్యూడెమోక్రసీ అభ్యర్థి. అధికారులు అవిశ్వాసం ఆమోదించి ఓటింగ్ నిర్వహిస్తే ప్రస్తుత మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు ప్రమోద్‌కు పదవీ గండం పొంచి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు.

నేటి నుంచి సామాజిక తనిఖీ



ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ క్షేత్రపర్యటన గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. 2022 జనవరి 1వ నుంచి 2023 మార్చి 31వ వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.5.36 కోట్ల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. ఆయా పరిశీలనపై కార్యాలయంలో తనిఖీ బృందం సభ్యులు రికార్డులను పరిశీలించారని చెప్పారు. గ్రామపంచాయతీల వారీగా తనిఖీ చేస్తారని వెల్లడించారు.

ఐఎన్‌టీయూసీ విజయఢంకా

ఏఐటీయూసీపై 47 ఓట్ల ఆధిక్యత



ఇల్లెందు: విజయోత్సవంలో ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: గుర్తింపు సంఘం ఎన్నికల్లో సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందు ఏరియాను ఐఎన్‌టీయూసీ సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన ఎన్నికల్లో ఇల్లెందు ఏరియాలో మొత్తం 614 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పట్టణంలోని 24 ఏరియా కమ్యూనిటీ హాల్‌లో చేపట్టారు. ఉత్కంఠగా సాగిన కౌంటింగ్‌లో ఏఐటీయూసీపై 47 ఓట్ల ఆధిక్యంతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. మొత్తం పోలైన ఓట్లలో ఐఎన్‌టీయూసీ 311 ఓట్లు, ఏఐటీయూసీ 264, గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) 7, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం 9, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ 7, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) 1, సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ 3, సింగరేణి తెలంగాణ ఉద్యోగుల సంఘం 1 ఓట్లు సాధించగా ఒక ఓటు చెల్లలేదని అని ఎన్నికల అధికారులు ప్రకటించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించినట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించడంతో ఐఎన్‌టీయూసీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.